సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 7 । ఆగస్టు । 2025



మధ్యాహ్నం.. అందని వైద్యం

ప్రభుత్వాసుపత్రుల్లో సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సిన కొందరు వైద్యులు మధ్యాహ్నం ఇంటికో, ప్రైవేటు ఆస్పత్రులకో పరిమితమవడంతో వైద్యసేవలు అందడం లేదు. 8లో ▸



గురక వ్యాధికి చికిత్స

వర్షాకాలంలో గేదెలు, దూడలకు ఎక్కువగా వచ్చే వ్యాధి గురక వ్యాధి. ఇది ప్రమాదమని.. తక్షణం గుర్తించి చికిత్స అందించాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. 8లో ▸



చెట్లకు చేటు

విద్యుత్ లైన్ పేరుతో జంగారెడ్డిగూడెంలో భారీ వృక్షాలను నరికి కలప తరలించుకుపోయారు. చెట్ల నరికివేతకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని అధికారులు తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కారుమూరి సునీల్



కారుమూరి సునీల్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్‌ను నియమించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జోన్ -2 వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సునీల్ కుమార్‌ను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. ఈ మేరకు జోన్ -2 పరిధిలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో సునీల్ పార్టీ యువజన విభాగానికి నాయకత్వం వహించనున్నారు. ఆయన నియామకంతో పార్టీ యువజన విభాగం మరింత బలోపేతమవుతుందని పార్టీ వర్గాలు ఆశిస్తున్నాయి.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలి




సబ్ స్టేషన్ వద్ద స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న దృశ్యం

నరసాపురం: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వెంటనే నిలుపుదల చేయాలంటూ ప్రజా వేదిక నరసాపురం ఆధ్వర్యంలో నరసాపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ప్రజా వేదిక జిల్లా కమిటీ సభ్యుడు మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండి అని చెప్పిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక విద్యుత్ భారాలతో ప్రజల నడ్డి విరగ్గొడుతుందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 14 నెలలకే రూ.15,485 కోట్లు ప్రజల నుంచి దోపిడీ చేసిందన్నారు. అదానీ కంపెనీ లాభాల కోసం కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల విషయంలో ప్రజలను తీవ్రంగా మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయకపోతే ప్రజా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పి.నారాయణరావు, కె.శ్రీనివాసు, బి.జోగేశ్వరావు, జి.నాగేశ్వరరావు, ఎస్.కొండ, పి.కామేశ్వరరావు, పి.అప్పల నాయుడు, కె.రవి,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు తొలగించడం పీ4 లక్ష్యం

భీమవరం (ప్రకాశంచౌక్): సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించడమే పీ4 ప్రధాన లక్ష్యమని ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. పీ4లో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో 10 శాతంగా ఉన్న ధనవంతులు, అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మంది నిరుపేదలకు చేయూత నివ్వడమే పీ4 లక్ష్యమన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వపు విద్యార్థులకు కూడా పీ4 పై అవగాహన కల్పించి వారు మార్గదర్శకులుగా చేరి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. ఉపాధ్యాయులు కూడా స్వచ్ఛందంగా మార్గదర్శకులు కావచ్చన్నారు. సమావేశంలో డీఈఓ ఇ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చట్టంపై విద్యార్థులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం ×జాతీయ న్యాయ సేవాధికార సంస్థ–బాలల స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం 2024పై అవగాహన కల్పించేందుకు ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ స్కూలు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకుని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయరాదని, గుడ్ టచ్ బాడ్ టచ్ పైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

తిరగని రాట్నం

కూటమి పాలనలో చేనేత రంగానికి ప్రోత్సాహం కరువైంది. ఆదరణ లేక మగ్గాలు మూలకు చేరుతున్నాయి. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చంద్రబాబు సర్కారు నేతన్నల వైపు కన్నెత్తి చూసింది లేదు. నేత మగ్గాలకు 200 యూనిట్ల వరకు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అంటూ ఇప్పుడు కంటితుడుపు చర్యలతో సరిపెడుతోంది.

- ఏడాదిగా నేతన్నల వైపు కన్నెత్తి చూడని కూటమి ప్రభుత్వం
- ప్రోత్సాహం లేక మూలకు చేరిన మగ్గాలు
- గతంలోనూ చీర–ధోవతి హామీని అటకెక్కించిన చంద్రబాబు
- నేతన్న నేస్తంతో అండగా నిలిచిన జగన్ సర్కారు
- ఉమ్మడి జిల్లాలోని 1,070 కుటుంబాలకు రూ. 12.76 కోట్ల సాయం
- నేడు జాతీయ చేనేత దినోత్సవం



అత్తిలి మండలంలో మూలకు చేరిన మగ్గం

సాక్షి, భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆరు వేల వరకు చేనేత కుటుంబాలున్నాయి. పాలకొల్లు, అత్తిలి, యలమంచిలి, పెంటపాడు, పోడూరు, ఆచంట మండలాల్లో నేత కార్మికులు అధికంగా ఉన్నారు. దివంగత వైఎస్ హయాంలో చేనేత రంగం ఒక వెలుగు వెలిగింది. నేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్, రుణ మాఫీ, అధిక వడ్డీలతో కార్మికులు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా ఆర్టిజన్ క్రెడిట్ కార్డుల ద్వారా పావలా వడ్డీకే కొత్తగా రుణ సాయం, చిలపనూలుపై పదిశాతం సబ్సిడీ, ఉచిత వైద్య శిబిరాలు, ఇళ్ల నిర్మాణం తదితర ఎన్నో కార్యక్రమాల ద్వారా చేనేత రంగాన్ని ఆయన ఆదుకున్నారు. తర్వాత పట్టించుకున్న వారు లేక సంక్షోభంలో కూరుకుపోయింది.

నేతన్నకు అండగా

తండ్రిని మించిన తనయునిగా చేనేత రంగానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. సొంత మగ్గం ఉన్న నేత కుటుంబాలకు వైఎస్సార్ నేతన్న నేస్తంగా నెలకు రూ. 2000 చొప్పున ఏడాదికి రూ.24,000 ఆర్థిక సాయం అందించారు. గత ప్రభుత్వంలోని ఐదేళ్లలో ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో సరాసరి 1,063 కుటుంబాలకు రూ.12.76 కోట్ల లబ్ధి చేకూరింది. ప్రస్తుత పశ్చిమ గోదావరి జిల్లాలో 920 కుటుంబాలకు రూ.10.96 కోట్లు, ఏలూరు జిల్లాలో 150 కుటుంబాలకు రూ. 1.8 కోట్ల సాయం అందించారు. అమ్మఒడి, చేయూత, పింఛన్, వాహనమిత్ర, ఆరోగ్య శ్రీ వైద్యం తదితర పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి లక్షలాది రూపాయల ప్రభుత్వ సాయం అందింది.

కంటి తుడుపు చర్యలే : గురువారం జాతీయ చేనేత దినోత్సవంగా సందర్భంగా చేనేతకు వరాల జల్లంటూ కూటమి ప్రచారం విమర్శలకు తావిస్తోంది. నేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, జీఎస్టీ మినహాయింపు కంటితుడుపు చర్యలుగా కార్మికులు కొట్టిపారేస్తున్నారు. వీటివల్ల చేనేత రంగానికి ఒనగూరేదేమి లేదంటున్నారు. జిల్లాలో కేవలం 677 నేత మగ్గాలకు మాత్రమే ఈ సాయం పరిమితం కానుంది.

గత ప్రభుత్వంలో నేతన్న నేస్తం ద్వారా అందించిన సాయం

పశ్చిమగోదావరి జిల్లా :

సంవత్సరం	లబ్ధిదారులు	ప్రభుత్వ సాయం (రూ. కోట్లలో)
2019–20	854	రూ. 2.01
2020–21	1,067	రూ. 2.57
2021–22	779	రూ. 1.87
2022–23	839	రూ. 2.02
2023–24	1,027	రూ. 2.47

ఏలూరు జిల్లా

సంవత్సరం	లబ్ధిదారులు	ప్రభుత్వ సాయం (రూ. లక్షల్లో)
2019–20	142	రూ. 34.10
2020–21	187	రూ. 44.90
2021–22	120	రూ. 28.80
2022–23	149	రూ. 35.76
2023–24	153	రూ. 36.72

మళ్లీ చిన్నచూపే

చీర–ధోవతి పథకాన్ని పునరుద్ధరిస్తానని, చేనేత ఉత్పత్తులపై 30 శాతం రిబేటు ఇస్తామంటూ 2014 ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తలేదు. ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకోవాలని నేతన్నలను చిన్నచూపు చూశారు. కూటమి ప్రభుత్వంలోనూ అదే తీరుగా ఉన్నారన్న విమర్శలున్నాయి. ఏడాదిగా ప్రోత్సాహం కరువై చేనేత కుటుంబాలకు పూటగడవడం కష్టంగా మారింది. బతుకుదెరువు కోసం మగ్గాలకు స్వస్తి చెబుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. చాలామంది కార్మికులు నేత పని వీడి వ్యవసాయ కూలీలుగా, ఇతర పనుల్లోకి వెళ్లిపోతున్నారు. ఏడాది క్రితం ఉమ్మడి జిల్లాలో 1187 మగ్గాలు ఉండగా ప్రస్తుతం 677కు తగ్గిపోయినట్టు తెలుస్తోంది.

చంద్రబాబుకు ఎప్పుడూ చిన్నచూపే



చేనేత అంటే చంద్రబాబుకు ఎప్పుడూ చిన్నచూపే. చేనేత అభివృద్ధికి ఆయన చేసిందేమీ లేదు. నేత కార్మికులను నిజంగా ప్రోత్సహించింది దివంగత వైఎస్సార్. తండ్రిని మించిన తనయుడిగా నేతన్న నేస్తం, సంక్షేమ పథకాలతో మాజీ సీఎం జగన్ నేత కార్మికులను ఆదుకున్నారు.

– వీరా మల్లిఖార్జునుడు, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు, పాలకొల్లు

ఎన్నికల హామీలు అమలుచేయాలి



చేనేత కార్మికుల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇవ్వడం వల్ల నేత కార్మికులకు పెద్దగా మేలు జరిగేది లేదు. చేనేతను ప్రోత్సహించే విధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేయాలి. గత ప్రభుత్వంలో మాదిరి సంక్షేమ పథకాలను అందజేయాలి.

నిల్లా బాలవీరయ్య, చేనేత కార్మికుడు, శివపురం

విద్యా శక్తి కార్యక్రమం బహిష్కరణ




భీమవరంలో జిల్లా విద్యాశాఖాధికారి నారాయణకు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

భీమవరం: పాఠశాల విద్యాశాఖ ప్రవేశపెట్టిన విద్యాశక్తి కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు బహిష్కరిస్తున్నట్లు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ విజయరామరాజు, జనరల్ సెక్రటరీ జి.ప్రకాశం చెప్పారు. బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు విజయరామరాజు, ప్రకాశం మాట్లాడుతూ విద్యాశక్తి కార్యక్రమం ఐచ్ఛికం మాత్రమేనని నిర్బంధం కాదని ప్రభుత్వం తెలిపినా కొంతమంది అధికారులు నిర్బంధంగా చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. దీనితో విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కో చైర్మన్ సాయివర్మ, ఎస్.శ్రీనివాస్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ రమణ, కోశాధికారి పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన పుస్తకాలపై వ్యతిరేకత

ఇప్పటికే విద్యాశక్తిని బహిష్కరించిన ఉపాధ్యాయులు



తొమ్మిదో తరగతి గణితం మూల్యాంకన పుస్తకం


నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ ద్వారా పాఠశాలలకు పంపిన మూల్యాంకన పుస్తకాలపై ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇస్తున్న పనులను చేయడానికే ఎక్కువ సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో మూల్యాంకన పుస్తకం ఇచ్చింది. దీంతో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి ఆరు మూల్యాంకన పుస్తకాలు ఇవ్వగా, ఫార్మేటివ్ అసిస్‌మెంట్, సమ్మేటివ్ అసిస్‌మెంట్ పరీక్షలను ఆ పుస్తకాల్లోనే విద్యార్థులతో రాయించాలి. విద్యార్థులు రాసిన తరువాత పరీక్షలను దిద్ది అందులోనే ఇచ్చిన ఓఎమ్మార్ షీట్‌లో మార్కులు వేయడంతో పాటు వారి పరీక్ష రాసిన పేజీలను స్కాన్ చేసి విద్యాశాఖ ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అప్‌లోడ్ చేసేటప్పుడు సర్వర్ బిజీగా ఉన్నా, నెట్ స్లోగా ఉన్నా అప్‌లోడ్ చేయడం తీవ్ర జాప్యమయ్యే అవకాశాలున్నాయి.

బడిలో దిద్దడానికి సమయమేది : గతంలో విద్యార్థి రాసిన పరీక్ష పేపర్లను ఉపాధ్యాయులు వారి వెసులుబాటును బట్టి బడిలో దిద్దేవారు. సమయం సరిపోకపోతే ఇళ్లకు తీసుకెళ్లి పేపర్లు దిద్దుకొని తీసుకొచ్చేవారు. ఇప్పుడు మూల్యాంకనం పుస్తకాలను ఇంటికి మోసుకొని వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని వాపోతున్నారు. ఆరో తరగతిలో 40 మంది విద్యార్థులుంటే వారందరి మూల్యాంకనం పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లి దిద్దడానికి వీలవ్వదు. బడిలోనే దిద్ది ప్రతి సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. ఒక్కొక్క విద్యార్థి మూడు పేజీలు రాస్తే వంద నుంచి 120 పేజీలను ఒక సబ్జెక్టుకు స్కాన్ చేయాల్సి ఉంటుంది. హైస్కూల్‌లో ఒక ఉపాధ్యాయుడు నాలుగు తరగతులకు వెళ్లినట్లయితే వారం రోజుల పాటు ఇదే పనిని చేస్తే పూర్తవుతుంది. ఇంత చేసినా విద్యార్థికి ఒనగూడే ప్రయోజనం శూన్యం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ మూల్యాంకనం పుస్తకాలను ఏ సబ్జెక్టుకు ఆ సబ్జెక్టు ఉపాధ్యాయుడు భద్రపరుచుకోవాలి.

విద్యాశక్తి నిర్బంధంగా అమలుపై నిరసన

హైస్కూల్‌ల్లో సాయంత్రం 4 గంటల తరువాత విద్యాశక్తి కార్యక్రమాన్ని విద్యాశాఖ అమలు చేస్తోంది. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తప్పనిసరిగా విద్యాశక్తి కార్యక్రమాన్ని అమలు చేయాల్సిందేనని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇది ఉపాధ్యాయులకు కొత్త తలనొప్పిలా మారింది. ఉపాధ్యాయ సంఘాలు అడిగినప్పుడు నిర్బంధం కాదని చెబుతున్న ఉన్నతాధికారులు ఆ తరువాత ఉపాధ్యాయులపై మండల స్థాయి అధికారులతో మేం వస్తున్నాం.. తనిఖీ చేస్తాం.. అంటూ ఒత్తిడి చేస్తూ పనిచేయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎన్నడూ లేవని ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు గత రెండు రోజులుగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో డీఈవోలకు వినతిపత్రాలను సైతం అందజేస్తున్నారు. ప్రశాంతంగా సాగాల్సిన విద్యారంగ కార్యక్రమాలను హడావుడిగా మార్చేసి తీవ్ర ఒత్తిడికి గురయ్యేలా ప్రభుత్వం చేస్తుండటంతో ఎంతో మంది ఉపాధ్యాయులు నేడు అనారోగ్యం పాలవుతున్నారనే ఆందోళన ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతోంది.

నేటి నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం నుంచి స్వామివారి దివ్య పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 10 వరకు వైభవంగా జరుగనున్నాయి. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసీ, తెలియక జరిగిన తప్పుల ప్రాయశ్చిత్తం నిమిత్తం నాలుగు రోజుల పాటు ఈ పవిత్రోత్సవాలను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. అందులో భాగంగా 7న అంకురార్పణ, 8న పవిత్రాధివాసం, 9న పవిత్రావరోహణ, 10న మహాపూర్ణాహుతి వేడుకలను నేత్రపర్వంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఉత్సవాలు జరిగే ఈ నాలుగు రోజులు ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నామని, భక్తులు గమనించాలని ఆయన కోరారు.

ఉంగుటూరు కూటమిలో కుంపట్లు

- జనసేన ఎమ్మెల్యే వర్సెస్ ఆప్కాబ్ చైర్మన్
- సుపరిపాలన తొలి అడుగు పేరుతో గన్ని హడావుడి
- పల్లె పల్లెకు పత్సమట్ల పేరుతో ఎమ్మెల్యే పోటీ కార్యక్రమం
- ఎమ్మెల్యేకు సన్నిహితంగా ఉండే టీడీపీ నేతలపై గన్ని వేటు
- గన్ని తీరుపై టీడీపీలో రగులుతున్న అసంతృప్తి



సాక్షి ప్రతినిధి, ఏలూరు: పైకి ఆప్యాయంగా పలకరించుకుని కౌగిలించుకుంటారు.. లోపల మాత్రం కత్తులు దూస్తారు. ఎమ్మెల్యే అధికారిక హోదాలో ఒక కార్యక్రమం చేస్తే.. ఆప్కాబ్ చైర్మన్ ప్రొటోకాల్ హోదాతో మరో కార్యక్రమం నిర్వహిస్తారు. సుపరిపాలన తొలి అడుగు పేరుతో ఉంగుటూరు నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు హడావుడి చేస్తుంటే.. పల్లె పల్లెకు పత్సమట్ల పేరుతో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మరో కార్యక్రమానికి తెరతీసి పోటాపోటీగా హడావుడి చేస్తున్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు సమాంతరంగా హడావుడితో పార్టీ కేడర్ మొదలుకొని అధికారుల వరకు ఇద్దరు నేతల మధ్య నలిగిపోతున్నారు. నిత్యం కూటమిలోని జనసేన, టీడీపీ నేతల మధ్య అసంతృప్తి, అసహనాలతో ఉంగుటూరు రాజకీయం వేడెక్కుతోంది.

ఎమ్మెల్యేతో చనువుగా ఉంటే వేటే..

పైకి ప్రేమగా కనిపించినా.. లోపల మాత్రం ఎమ్మెల్యే ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు కత్తులు దూసుకుంటున్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో బలపడితే భవిష్యత్‌లో తన రాజకీయ మనుగడ కష్టమవుతుందనే రీతిలో గన్ని చెక్ పెడుతూ వస్తున్నారు. ఆప్కాబ్ చైర్మన్ పదవి రావడంతో మరింత వేగం పెంచి నియోజకవర్గంలో మండలాల్లో పెత్తనం సాగించడంతో పాటు ఎమ్మెల్యేతో సన్నిహితంగా మెలిగే టీడీపీ నేతలపై వేటు కొనసాగిస్తున్నారు. ఉంగుటూరు మండల అధ్యక్షుడు పాతూరి విజయ్‌కుమార్ ఎన్నికల సమయంలో ధర్మరాజుకు సహకరించారనే కారణంతో మండల అధ్యక్ష పదవి నుంచి తొలగించారు. ఎన్నికల ప్రచార సమయంలోనే నారాయణపురంలో విజయ్‌కుమార్‌పై టీడీపీ వ్యక్తులే దాడి చేయడం గమనార్హం. భీమడోలు మండల అధ్యక్ష పదవిని సీనియర్లను కాదని నామినేట్ పదవి ఉన్న వ్యక్తికే కేటాయించడంపైన టీడీపీ కేడర్ రగులుతున్నారు. ఖర్చుతో కూడిన భీమడోలు మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని తొలుత బీసీ మహిళకు కేటాయించారు. గన్ని వీరాంజనేయులు బీసీ మహిళ నుంచి దాన్ని బీసీ జనరల్ చేసి తన వర్గానికి చెందిన శేషగిరికి దక్కేలా చేశారు. మార్కెట్ యార్డుకు స్థానిక ప్రజాప్రతినిధి గౌరవ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ప్రొటోకాల్ ఉల్లంఘించి ప్రమాణస్వీకారానికి ఎమ్మెల్యేను పిలవకపోవడం వివాదమైంది. సుపరిపాలన తొలి అడుగు పేరుతో రాష్ట్ర మంత్రులు, జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలను ఆహ్వానించి గన్ని హడావిడి చేస్తున్నారు.

మరోవైపు పల్లె పల్లెకు పత్సమట్ల పేరుతో అధికార యంత్రాంగాన్ని మొత్తం తీసుకుని ఎమ్మెల్యే పోటీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే క్యాంపుతో టచ్‌లో ఉండే సీనియర్ నేతలను వ్యూహాత్మకంగా పక్కన పెట్టేలా గన్ని వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ సీనియర్ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇప్పటికే అధిష్టానానికి ఫిర్యాదు చేసే దిశగా అసంతృప్తి నేతలు పావులు కదుపుతున్నారు.

నీకు సగం.. నాకు సగం

ఉంగుటూరులో జనసేన వర్సెస్ టీడీపీ రగడ తారాస్థాయికి చేరింది. నిన్న మొన్నటి వరకు పనులు, పంపకాలు పర్సంటేజీల మధ్య చాప కింద నీరులా కొనసాగిన అంతర్యుద్ధం నేడు ప్రొటోకాల్ వ్యవహారాలకు పాకింది. మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులను కాదని జనసేన ఇన్‌చార్జి ధర్మరాజుకు టిక్కెట్ కేటాయించడం, ఎన్నికల్లో ధర్మరాజు గెలవడంతో నియోజకవర్గంలో రగడకు తెరలేచింది. టీడీపీకే ఉంగుటూరు టిక్కెట్ ఇవ్వాలని ఎన్నికలకు ముందు గన్ని వర్గం భారీ ర్యాలీతో టీడీపీ రాష్ట్ర కార్యాలయం వద్ద హడావుడి చేసింది. టీడీపీ అధిష్టానం గట్టిగా చెప్పడంతో సైలెంట్ అయిపోయారు. ధర్మరాజు గెలవడంతో నియోజకవర్గంలో పూర్తి స్థాయి పెత్తనం కోసం హడావుడి మొదలైంది. నీకు సగం.. నాకు సగమంటూ పంచాయితీలకు తెరతీశారు. నామినేట్ పదవులు, వర్క్‌లు, మద్యం షాపుల ఇలా అన్నింటిని పంపకాలు చేసేలా టీడీపీ కీలక నేతలు ఒత్తిడి తెచ్చి నియోజకవర్గంలో ప్రతి దాంట్లో గన్నికి వాటాలు ఏర్పాటు చేశారు. ఉదాహరణకు నియోజకవర్గంలో 17 సొసైటీలు ఉంటే 8 జనసేన, 8 టీడీపీ, 1 బీజేపీకి కేటాయించారు. ఈ క్రమంలో టీడీపీ నుంచి సొసైటీ చైర్మన్లుగా ఎంపికైన వారికి చాలా ఖర్చయిందనేది నియోజకవర్గంలో అందరికి తెలిసిన బహిరంగ రహస్యం.

టీడీపీ గూండాల దాడి హేయం



నౌడు వెంకటరమణ

భీమడోలు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, నాయకులపై పులివెందులలో టీడీపీ గుండాలు చేసిన దాడి అత్యంత హేయమని పార్టీ రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ ఓ పత్రికా ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు తెగబడడం హేయమైన చర్య అన్నారు. టీడీపీలో పెదబాబు, చినబాబుకు భయం పట్టుకుందన్నారు. జగన్‌మోహనరెడ్డి రోడ్డుపైకి వస్తే చాలు టీడీపీకి భయమని, అందుకే పార్టీ శ్రేణులపై పచ్చ గుండాలు దాడులు చేస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం తీరును మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. దాడి చేసిన గుండాలను కఠినంగా శిక్షించాలని కోరారు. దాడికి నిరసనగా నేడు బీసీ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు.

విద్యాసంస్థల బస్సులపై కేసుల నమోదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లావ్యాప్తంగా మోటారు వాహనాల తనిఖీ అధికారులు బుధవారం విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేశారు. వివిధ ఉల్లంఘనలకు పాల్పడినందుకు 15 కేసులు నమోదు చేసి, రూ.26 వేలు జరిమానా విధించినట్లు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ తెలిపారు. వాహనదారులు లైసెన్స్‌తో పాటు సంబంధిత వాహన పత్రాలను ఉంచుకోవాలని, రహదారి భద్రతా నియమాలను తప్పక పాటించాలన్నారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులను, ప్రైవేటు వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

క్లుప్తంగా

సీతంపేట వద్ద లారీ బోల్తా



సీతంపేట సమీపంలో తిరగబడ్డ లారీ

కొయ్యలగూడెం : సీతంపేట సబ్ స్టేషన్ సమీపంలో జాతీయ ప్రధాన రహదారిపై బుధవారం ఓ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. రాజమండ్రి వైపు వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న మరో లారీని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు మార్జిన్ వైపు పల్టీ కొట్టింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. రోడ్డు పక్కనే ఉన్న చెత్తకి నిప్పు పెట్టడం వల్ల రోడ్డుపై భారీగా పొగ అలుముకోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడం ఈ ప్రమాదానికి కారణంగా పోలీసులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆట్యా పాట్యా జిల్లా జట్ల ఎంపిక



ఆట్యా పాట్యా జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

భీమవరం: పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం స్కూల్లో బుధవారం ఆట్యా–పాట్యా జిల్లా జట్ల ఎంపిక జరిగింది. క్రీడాకారులు పి గోపీకృష్ణ, డి మోహన్‌కుమార్, జి యశ్వంత్‌రమణ, కె సాయిధనుష్, జె అభిషేక్‌పాల్, వి జయసంతోష్, పి రోహిత్ కుమార్, వి మణికంఠ గణేష్, ఎం తేజమహిమ, ఎం అభిరామ్, బి వెంకన్న, పి ప్రేమ్‌కుమార్, పి భాస్కరతేజ జిల్లా జట్లకు ఎంపికయ్యారని ఆట్యాపాట్యా జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన రామచంద్రరాజు, జి కిరణ్‌వర్మ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9వ తేదీ నుంచి ఒంగోలులో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

వైభవం.. శోభనాచలుడి పవిత్రోత్సవం



ఆగిరిపల్లి: స్థానిక శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి వైభవంగా పవిత్రములు సమర్పించారు ఉదయం స్వామివారికి స్నపన, ప్రత్యేక అలంకరణ, శ్రీ లక్ష్మీ నరసింహ సుదర్శన మూలా మంత్ర హోమం, దిగువ సన్నిధిలో ఉన్న స్వామివారికి పవిత్రములు సమర్పణ, నవ కుంభారాధన, శాంతి హోమం ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంత కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వణాధికారి సాయి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నకిలీ డెత్ సర్టిఫికెట్ వ్యవహారంపై విచారణ

కుక్కునూరు: నకిలీ డెత్ సర్టిఫికెట్ వ్యవహారంపై భద్రాచలం పోలీసులు విచారణ చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం సారాపాక గ్రామానికి చెందిన భూక్యా శ్రీరాములు పేరిట ఓ ఎల్‌ఐసీ ఏజెంట్ రూ.10 లక్షల పాలసీకి ఏడేళ్లుగా ప్రీమియం చెల్లిస్తున్నాడు. ఆ వ్యక్తి బతికుండగానే మరణించినట్లుగా కుక్కునూరు పంచాయతీ నుంచి డెత్ సర్టిఫికెట్ పొంది ఎల్‌ఐసీ నుంచి రూ.10 లక్షలు క్లయిమ్ చేశాడు. ఈ విషయాన్ని గత ఫిబ్రవరి 10వ తేదీన 'సాక్షి' దినపత్రిక బహిర్గతం చేసింది. కాగా ఈ వ్యవహారంలో డబ్బును రికవరీ చేసిన ఎల్‌ఐసీ కార్యాలయ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భద్రాచలం పోలీసులు విచారణ చేపట్టారు. కుక్కునూరులో నకిలీ సర్టిఫికెట్ ఎవరు ఇచ్చారన్న విషయమై గత నాలుగు రోజులుగా కొందరిని స్టేషన్‌కు పిలిపించి ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

మధ్యాహ్నం.. అందని వైద్యం

- మధ్యాహ్నం ఇళ్లు.. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉంటున్న వైద్యులు
- వైద్యులు లేకపోవడంతో సొంత వైద్యం చేస్తున్న సిబ్బంది
- కునారిల్లుతున్న సర్కారు దవాఖానాలు

జ్వరంతో వణుకుతూ ఓ పెద్దావిడ పీహెచ్‌సీకి మధ్యాహ్నం సమయంలో వచ్చింది. ఆమెను చూసిన నర్సు ఇప్పుడు వచ్చావేంటి డాక్టర్ ఉండరు కదా.. ఉదయం రాకపోయావా అన్నారు. ఉన్నట్టుండి చలిజ్వరం రావడంతో వచ్చానమ్మ అని ఆ పెద్దావిడి సమాధానమిచ్చింది. దీంతో ఆ నర్సు డాక్టర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పగా.. పారాసెట్‌మాల్, యాంటీబయాటిక్ ఇచ్చి పంపించేయ్.. రేపు ఉదయం రమ్మని చెప్పు.. అని కటువుగా వైద్యుడు చెప్పాడు.

అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఓ వృద్ధుడు కర్ర చేతపట్టుకుని మధ్యాహ్నం పూట వచ్చాడు. అక్కడే ఉన్న నర్సు ఆ వృద్ధుడిని చూసి.. డాక్టర్ మధ్యాహ్నం ఉండరు తాతా.. రేపు ఉదయం రా అని చెప్పింది. సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సిన డాక్టర్ ఉండకపోతే అడిగేవారే లేకుండా పోయారు అంటూ సణుగుతూ వెనుదిరిగాడు.

తణుకు అర్బన్ : గత ఐదేళ్లపాటు పేదలపాలిట సంజీవనిలా సత్వర వైద్యసేవలందించిన ఆస్పత్రులు నేడు వేళకు రాని వైద్యులతోపాటు, ఆస్పత్రిలో కాలు నిలవక బయటకు వెళ్లే వైద్యుల కారణంగా పేదలకు వైద్యసేవలు కునారిల్లుతున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రుల్లో ఉండాల్సిన వైద్యులు నేడు విధులకు ఆలస్యంగా కొందరు, ఎఫ్‌ఆర్‌ఎస్ వేసేసి ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రాక్టీస్ కోసం వెళ్లే వారు కొందరు, మధ్యాహ్నం పూర్తిగా ఇంటికో, ప్రైవేటు ఆస్పత్రులకో పరిమితమయ్యే మరి కొందరు వైద్యుల కారణంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందడం లేదు. ముఖ్యంగా గ్రామాల్లో ఈ తరహా పరిస్థితులు అధికంగా కనిపిస్తున్నాయని రోగులు ఆరోపిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగాల్లో వైద్యులు 80 శాతం మంది ఒంటిపూట వైద్యానికి అలవాటుపడ్డారని వైద్య సిబ్బంది బాహాటంగానే చెబుతున్నారు. దూర ప్రాంతాల నుంచి క్యారేజీలు పట్టుకుని వచ్చే వైద్యులు మాత్రమే పూర్తిస్థాయిలో ఆస్పత్రిని అంటిపెట్టుకుని ఉంటుండగా, భోజనానికి ఇంటికెళ్లి వచ్చే వైద్యులు చాలా మంది తిరిగి ఎఫ్‌ఆర్‌ఎస్ వేసేందుకు మాత్రమే వస్తున్నట్లుగా





ఇరగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తణుకు అర్బన్ హెల్త్ సెంటర్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు వైద్యుడు అందుబాటులో లేక ఖాళీగా ఉన్న కుర్చీ

విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు వైద్యులైతే ఉదయం పూట కూడా ప్రైవేటు వైద్యానికి వెళ్లే పరిస్థితులు తలెత్తాయని రోగులు, వైద్య సిబ్బంది చెబుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల మాదిరిగానే పట్టణాల్లో కూడా పేదలకు వైద్యసేవలు మరింత చేరువ చేసే ఉద్దేశ్యంతో అర్బన్ హెల్త్ సెంటర్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో పట్టణ ప్రాంతాల్లోని పేదలు సైతం దూర ప్రాంతాల్లోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లే అవసరం లేకుండానే సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లలో వైద్య సేవలు పొందుతున్నారు.

దూరమైన సత్వర వైద్యం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆయా ఆస్పత్రుల్లో ఉండి రోగులకు సత్వర వైద్యం అందించాల్సి ఉండగా ప్రస్తుతం ఆ తరహా సేవలు అందడంలేదని రోగులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఉదయం ఏదోలా వైద్యం అందుతున్నా ఇక మధ్యాహ్నం 1 గంట తరువాత జిల్లా వ్యాప్తంగా వైద్యులు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండడంలేదనేది వాస్తవమని రోగులు స్వయంగా చెబుతున్నారు. అంతేకాకుండా మధ్యాహ్నం నుంచి పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్‌లకు వచ్చే రోగులకు అందుబాటులో ఉన్న వైద్య సిబ్బంది వైద్యం అందిస్తున్నారని తెలుస్తోంది. మధ్యాహ్నం వచ్చిన రోగులను మరుసటి రోజు రావాలని, ఇబ్బంది ఎక్కువగా ఉంటే వైద్యులకు ఫోన్ చేస్తామని అప్పుడు సదరు వైద్యుడు వస్తారని వైద్యసిబ్బంది చెబుతుండడం శోచనీయం.

జిల్లాలో ప్రభుత్వ ఆస్ప్రతులు ఇలా..

వైద్య ఆరోగ్య శాఖ..	
పీహెచ్‌సీలు	34
యూపీహెచ్‌సీలు	18
పీపీ యూనిట్	1
లెప్రసీ వార్డు	1
డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్	
జిల్లా ఆస్పత్రి	1
ఏరియా ఆస్పత్రులు	5
కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు	3

వైద్యులు 200లకుపైగా..
నిత్యం 16 వేలకుపైగా రోగులు..

ప్రైవేటు యాజమాన్యాలే టార్గెట్..?

సర్కారు దవాఖానాలకు వచ్చే పేదలకు వైద్యసేవలు అందుతున్నాయా లేదా అని పర్యవేక్షణ చేయాల్సిన ఉన్నతాధికారులు ఇటీవల కేవలం ప్రైవేటు ఆస్పత్రులు, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు మాత్రమే తనిఖీలు చేయడం వెనుక గూడార్థం ఏంటా అనేది వైద్యవర్గాల్లోను చర్చనీయాంశమైంది. తరచూ వైద్యశాఖ ఉన్నతాధికారులు కేవలం ప్రైవేటు యాజమాన్యాలనే కలుస్తుండడంపై కూడా పలువురు పెదవి విరుస్తున్నారు. ఇక డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి ఉన్నతాధికారులు సంబంధిత ఆస్పత్రుల్లో ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లాలో కొందరు వైద్యులు తమ ఇష్టానుసారంగా పనిచేస్తున్నారని తెలుస్తోంది. ఈ సమస్యలపై డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయిని 'సాక్షి' వివరణ కోరగా ఆస్పత్రుల్లో వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సిందేనని, కొందరు వైద్యులు అదనంగా మరికొన్ని ఆస్పత్రుల్లో ఇన్‌చార్జులుగా ఉంటున్నారని, వైద్యుల తీరుపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తానని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



దోస నరసింహ స్వామి (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి నెలా పదిహేను రోజులుగా చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందాడు. వివరాల ప్రకారం.. మండలంలోని ఉల్లంపర్రు గ్రామానికి చెందిన దోస నరసింహస్వామి (56) జూన్ 19వ తేదీన గ్రామం నుంచి పాలకొల్లు పట్టణానికి వస్తుండగా కెనాల్ రోడ్డులో వాటర్ వర్క్స్ ప్రాంతంలో వెనుక నుంచి మినీ వ్యాన్ ఢీకొట్టడంతో తలకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు వెంటనే స్పందించి పట్టణ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి గుంటూరు తరలించగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బ్రెయిన్‌కు చికిత్స చేశారు. అప్పటి నుంచి అపస్మారకస్థితిలోనే ఉన్న స్వామి బుధవారం ఉదయం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. నరసింహస్వామికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇతను పట్టణంలో ఓ ఎడ్యుకేషన్ కోచింగ్ సెంటర్‌ను నడుపుతుండేవారు. పట్టణ ఎస్సై పృథ్వీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పంచనామా నిర్వహించారు.

సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌కు సత్కారం



సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): బదిలీపై వెళుతున్న నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్‌ను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఘనంగా సత్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం రెవెన్యూ అధికారుల సమావేశం అనంతరం నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్‌ను దుశ్శాలువ, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, రమణ, ఎస్డీసీ భాస్కర్, సర్వే శాఖ ఏడీ అన్సారీ, కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు చల్లన్న దొర, విజయ్‌కుమార్‌రాజు, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం



కాలువలో నుంచి వృద్ధురాలి మృతదేహాన్ని తీసుకువస్తున్న ఫైర్, పోలీస్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శివాలయం వద్ద కాలువలో పడిపోయి గల్లంతైన చంద్రవతి (70) వృద్ధురాలి మృతదేహాన్ని బుధవారం కనుగొన్నారు. ఈనెల 4వ తేదీన ఆమె కాలువలో పడిపోగా, అధికారులకు అందిన సమాచారం మేరకు 5వ తేదీన ఫైర్, పోలీస్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కాలువలో బోట్ సహాయంతో విస్తృతంగా గాలింపు చేపట్టారు. కడకట్ల సమీపంలో బుధవారం మధ్యాహ్నం చంద్రవతి మృతదేహాన్ని బయటకు తీశారు. ఫైర్ సిబ్బందిచే మృతదేహాన్ని పోలీస్ శాఖకు అప్పగించారు. మృతురాలి బంధువులు హాజరయ్యారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన సింగిరికొండ వేణుగోపాల్(50) ఆక్వాచెరువుల్లో మేతలు విక్రయిస్తూ ఉంటాడు. దీనిలో భాగంగా ఈ నెల 3వ తేదీన హైదరాబాద్ నుంచి ఉండి వచ్చాడు. ఇక్కడ నుంచి ఆకివీడుకు చెందిన యర్రా నర్సింహరావుతో గణపవరం వెళుతుండగా ఉండి శివారు పదెకరాల తూము వద్ద థర్మకోల్ ఫ్యాక్టరీ సమీపంలో ఫోన్ రావడంతో బండి దిగి రోడ్డు పక్కన మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో ఉండి నుంచి గణపవరం వెళుతున్న ద్విచక్ర వాహనదారులు వేగంగా అతడిని ఢీ కొట్టడంతో వేణుగోపాల్ తలకు, కాలిపైనా గాయలయ్యాయి. భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వేణుగోపాల్ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

పశువుల్లో గురక వ్యాధికి చికిత్స ఇలా..



మెట్ట ప్రాంతంలో పశువులకు చికిత్స చేస్తున్న దృశ్యం

పాడి-పంట

చింతలపూడి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పాడి పశువుల పెంపకానికి ప్రసిద్ధి. ఇక్కడి రైతులు పాడి పశువులను పెంచుకుంటూ ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అయితే వర్షాకాలంలో పశువులు రకరకాల అంటు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కొత్త నీరు మురుగు నీటితో కలిసి కలుషితం కావడం కారణంగా పశువులు ఆ నీటిని తాగడంతో అంటురోగాలు సోకి విలువైన పశు సంపద కోల్పోయే ముప్పు ఉంది. వర్షాకాలంలో గేదెలు, గేదె దూడలు, పడ్డలకు ఎక్కువగా వచ్చే వ్యాధి గురక వ్యాధి. దీనినే గొంతువాపు వ్యాధి అని కూడా పిలుస్తారు. పశువుల్లో వచ్చే వ్యాధుల్లో ఇది అత్యంత ప్రమాదకరమైనది. గురక వ్యాధి సోకిన పశువులకు అందించాల్సిన చికిత్సను గురించి పశుసంవర్ధక శాఖ ఏడీ డా కె లింగయ్య వివరించారు.

ఎలా సంక్రమిస్తుంది

పాశ్చురెల్లా మల్టోసిడా అనే బ్యాక్టీరియ వల్ల పశువులు, గొర్రెలు, మేకల్లో వచ్చే ఈ వ్యాధి క్రిములు ఎడతెరపి లేని ముసురు వాతావరణంలో వేగంగా వృద్ధి చెందుతాయి. కలుషితమైన నీరు, మేత, పరికరాలు, విసర్జకాలు, స్రావాలు, కళేబరాలు, మాంసం ద్వారా వేగంగా వ్యాప్తి చెందుతాయి. ఇందుకు ఈగలు, దోమలు, ఇతర కీటకాలు కూడా దోహదపడతాయి. వ్యాధి క్రిములు శ్వాస, జీర్ణ వ్యవస్థ, దోమ కాట్ల ద్వారా శరీరంలోకి ప్రవేశించి ఎర్ర రక్త కణాలను ధ్వంసం చేసి రక్తం ప్రాణవాయువు ప్రక్రియను దెబ్బ తీస్తుంది. దీంతో ప్రాణవాయువు సరిగా అందక పశువులు గురక పెట్టడం, రొప్పడం, ఆయాసపడటం వంటి లక్షణాలను ప్రదర్శిస్తుంది. పశువుల శరీర ఉష్ణోగ్రత 106 నుంచి 108 ఫారిన్ హీట్ వరకు పెరగడం, కనుపాపలు ఎర్రగా మారిపోవడం, మేత నెమరు నిలిచిపోవడం, మెడ గొంతు వాయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి క్రిములు శరీరంలోకి ప్రవేశించిన 12 నుంచి 36 గంటలకు వ్యాధి లక్షణాలు కనిపించి, సకాలంలో సరైన వైద్యం అందకపోతే మరో 12 నుంచి 24 గంటల్లో పశువు మరణిస్తుంది.

గురక వ్యాధి చికిత్స

వ్యాధిని గుర్తించిన మరుక్షణం రక్త పరీక్షలు నిర్వహించాలి. వ్యాధి సోకిన పశువును ఇతర పశువుల నుంచి వేరు చేయాలి. ప్రశాంత వాతావరణంలో పశువులకు పరీక్షలు చేయిస్తే మంచిది. ఈ పరిస్థితుల్లో పశువులను నిలబెట్టి మాత్రమే వైద్యం చేయడం శ్రేయస్కరం. యాంపిసిల్లిన్, క్లోక్సాసిలిన్, జెంటా మైసిన్, సెఫలాక్సిన్ వంటి యాంటిబయోటిక్ మందుల్ని సరైన మోతాదులో అవసరాన్ని బట్టి రక్తం లోకి ఎక్కిస్తే వేగంగా ఉపశమనం కలుగుతుంది. సాంబ్రాణి ధూపం వేయడం కూడా మంచిదే. వ్యాధి నిరోధక శక్తిని పెంచే మోమెజోల్ ఇంజక్షన్‌లు, బి–కాంప్లెక్స్ ఇంజక్షన్‌లు బాగా నీరసించిన పశువుకైతే డెక్ట్రోజ్ సెలైన్లు అవసరం కూడా ఉంటుంది.

నివారణ

గురకవ్యాధి సోకిన పశువులకు రోగ క్రిములను కలిగిన కలుషిత మేత, నీరు పరికరాలు, కళేబరాలను దూరంగా తరలించాలి. కళేబరాలను లోతుగా పూడ్చి వేయడం మంచిది. పరిసరాల్లో క్రిమి కీటకాలు వృద్ధి చెందకుండా పొడిగా ఉంచాలి. డిడిటి, గమాక్సిన్ ,సైపర్ మెత్రిన్, కార్బొరిల్ వంటి క్రిమి సంహారకాలతో క్రిమి రహితం చేయాలి. పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన పశువులను కనీసం వారం రోజులన్నా వేరుగా ఉంచి వ్యాధి లేదని నిర్ధారించుకున్నాక మిగిలిన పశువులతో కలవనీయ్యాలి. గురకవ్యాధి నివారణకు ప్రభుత్వం ఏటా ఉచితంగా టీకాలు వేయిస్తోంది. ప్రస్తుతం గురక వ్యాధి, జబ్బవాపు, గాలికుంటు వ్యాధుల నిర్మూలనకు ఒకే వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. పశువైద్యుల సూచనల మేరకు ఈ టీకాలను తొలకరి తొలి దశలో లేదా ఎండలు ముదరక ముందు వేయిస్తే మంచిది.



దా కె లింగయ్య, పశు సంవర్ధక శాఖ ఏడీ, చింతలపూడి



చెట్లు నరికివేసి దుంగలుగా పడవేసిన దృశ్యం



ట్రాక్టర్ ట్రక్కుపై లోడ్ చేసిన దుంగలు



చెట్లు నరికివేయగా మిగిలిన చెట్ల మొదలు

చెట్లకు చేటు

జంగారెడ్డిగూడెం: విద్యుత్ లైన్ పేరు చెప్పి భారీ వృక్షాలను అక్రమంగా నరికివేసి కలప తరలించుకుపోయారు. ఈ ఘటన జంగారెడ్డిగూడెంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం శివారు మార్కండేయపురంలో పంచాయతీ రాజ్ రోడ్డు వెంబడి భారీ వృక్షాలు ఉన్నాయి. వీటిని కొందరు అక్రమార్కులు బుధవారం నరికివేశారు. స్థానికులు ఇదేంటని ప్రశ్నిస్తే విద్యుత్ లైన్‌ల నిర్మాణం నిమిత్తం చెట్లను నరికినట్లు తెలిపారు. దీంతో అనుమానం వచ్చి ప్రజా సంఘాల నాయకులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీపీఐ నాయకులు జేవీ రమణరాజు, రాధాకృష్ణ చెట్ల నరికివేతపై పంచాయతీ రాజ్ డీఈ సాజుద్దీన్‌కు ఫిర్యాదు చేయగా చెట్ల నరికివేతకు సంబంధించి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ డీఈ యు.సుబ్బారావును వివరణ కోరగా, తాము ఆ ప్రాంతంలో ఎటువంటి విద్యుత్ లైన్‌లు వేసే పనులు నిర్వహించడం లేదని చెప్పారు. అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరికివేస్తూ శాఖల పేర్లు చెప్పి వాటిని తరలించుకుపోవడంపై ప్రజాసంఘాల నాయకులు అభ్యంతరం తెలిపారు. దీనిపై సాజుద్దీన్ స్పందిస్తూ పూర్తి స్థాయి విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నరికిన చెట్లను లోడ్ చేస్తున్న వ్యక్తులు

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



సుధారాణి మృతదేహం

మండవల్లి : భార్యాభర్తల నడుమ చిన్నపాటి విభేదాల కారణంగా మనస్తాపంతో విషం తాగి ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం ప్రత్తిపాడులో బుధవారం చోటుచేసుకుంది. మృతురాలు ప్యారా సుధారాణి(35)గా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు ఆస్పత్రిలో భద్రపరిచారు.

గ్యాస్ బండ మీద పడి.. డెలివరీ బాయ్ మృతి

చింతలపూడి: స్థానిక బోయగూడెం గ్రామానికి చెందిన బందెల హానోక్ (30) గ్యాస్ బండ మీదపడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హానోక్ స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ గ్యాస్ కంపెనీలో గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం ఊటసముద్రం గ్రామానికి గ్యాస్ బండలు డెలివరీ చేయడానికి వెళ్లి వాహనం నుంచి గ్యాస్ బండలు దించుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. దీంతో తలకు బలమైన గాయాలు అవ్వడంతో వెంటనే స్థానికులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హానోక్ మృతి చెందడంతో బోయగూడెంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు గ్యాస్ కంపెనీ నిర్వాహకులను కోరగా నిరాకరించడంతో దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆందోళనకు దిగుతున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి తణుకులో జిల్లాస్థాయి క్రీడాపోటీలు

భీమవరం: జాతీయ క్రీడా దినోత్సంలో భాగంగా ఈనెల 8వ తేదీ నుంచి జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు తణుకులో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి రాజేష్ చెప్పారు. 8వ తేదీన స్త్రీ, పురుషులకు బాడ్మింటన్, ఖోఖో పోటీలను తణుకు పట్టణంలోని ఎస్‌కేఎస్ ఉమెన్స్ కళాశాల ఆవరణలోను, కబడ్డీ, ఖోఖో పోటీలు జెడ్పీ బాయిస్ హైస్కూలు ఆవరణలో, వాలీబాల్ పోటీలు ఎస్‌సీఐఎం డిగ్రీ ప్రభుత్వ కళాశాల ఆవరణలో జరుగుతాయన్నారు. 9వ తేదీన జెడ్పీహైస్కూల్ ఆవరణలో ఆర్చరీ, బాక్సింగ్ పోటీలు, అథ్లెటిక్స్, హాకీ పోటీలు ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాస్కెట్‌బాల్ పోటీలు జెడ్పీహైస్కూల్, ఎస్‌కేఎస్‌డీ ఉమెన్స్ కళాశాల ఆవరణలో జరుగుతాయన్నారు. 10వ తేదీన ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు రాజేష్ చెప్పారు. 14–22 ఏళ్ల మధ్య వయస్సు గలవారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. వివరాలకు సెల్: 85000 64372 నంబర్లో సంప్రదించాలన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఎస్సైలు పి.ఉమామహేశ్వరరావు, పి.సునీల్ కుమార్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న లోసరి గ్రామానికి చెందిన పి.దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాధితుడి ఫిర్యాదు మేరకు చోరీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. పట్టణానికి చెందిన రెల్ల వెంకట పోతురాజు తన స్నేహితుడితో కలిసి స్థానిక చింతలబజార్‌లో దుర్గశ్రీసాయి సెల్‌ఫోన్ షాపు నిర్వహిస్తున్నాడు. గత నెల 11వ తేదీ రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. 12వ తేదీ ఉదయం షాపునకు ఎదురుగా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న మెహిద్దీన్, పోతురాజుకు ఫోన్ చేసి షాపు తాళాలు పగులగొట్టి ఉందని తెలిపాడు. షాపునకు వచ్చిన పోతురాజు లోపల పరిశీలించగా, రెండు టచ్‌ఫోన్‌లు, బంగారం ఉంగరం చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

పీఆర్టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

అత్తిలి: మండలంలో ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చలం, ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మెమో 57ను అమలు చేయాలని, కోర్టు ఉత్తర్వులు ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు చేయాలని, 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, తరగతి బోధనకే పరిమితం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ టి. గణపతి, జిల్లా కార్యదర్శి జి రాజేష్ కుమార్, మండలఅధ్యక్షుడు బి ప్రసన్నకుమార్, కార్యదర్శి టి చిరంజీవి మిత్ర, జిల్లా కార్యదర్శి పి చంద్రశేఖర్, రావి శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



దేవేంద్రను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెదతాడేపల్లిలో టస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి అడ్డాల జై మణి వెంకట దేవేంద్రనాయుడు రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ బొలిశెట్టి దేవీప్రియ బుధవారం తెలిపారు. జిల్లాస్థాయిలో అండర్-14 బాలుర విభాగంలో ట్రయాత్లాన్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు చెప్పారు. ఈనెల 9 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో దేవేంద్ర పాల్గొంటాడన్నారు. దేవేంద్రను స్కూల్ కరస్పాండెంట్ బొలిశెట్టి రాజేష్, ప్రిన్సిపాల్ దేవీప్రియ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన

భీమవరం: విద్యార్థులకు చిన్నతనం నుంచే ఉపాధ్యాయులు పర్యావరణంపై అవగాహన కల్పించడం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చునని ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి అన్నారు. బుధవారం భీమవరం పట్టణంలో ఏఆర్ కేఆర్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రజలంతా చైతన్యవంతులై సహరించాలన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పీబీ శ్రీనివాస్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాము, ఏకే మహాలక్ష్మి, వేల్పుల నాగేశ్వరరావు, చిట్టి కుమారి తదితరులు పాల్గొన్నారు.

స.హ చట్టంపై అవగాహన అవసరం

భీమవరం (ప్రకాశంచౌక్): సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డా.వై.నూకరాజు తెలిపారు. భీమవరంలోని జిల్లా ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి సమాచార హక్కు చట్టం పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం యొక్క ఆవశ్యకత, ప్రయోజనాలు, దాని ప్రాముఖ్యతపై సమగ్రమైన అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం 2005, ప్రజలకు ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం పొందే హక్కును కల్పిస్తుందని, ఇది పారదర్శకత, నైతికత, జవాబుదారీ తనాన్ని పెంపొందించేందుకు ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరంలో ఉచితంగా మందులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: స్వచ్ఛంద సేవా సంస్థలు ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. బుధవారం మండలంలోని ఎల్.అగ్రహారం టిడ్కో గృహ సముదాయంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ పేదలకు ఉన్నత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం ఆశ్రం ఆసుపత్రి వైద్య బృందం కేన్సర్, గుండె, సుగర్, స్త్రీల సమస్యలకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు దువ్వా శ్రీను, రామగాని సత్యనారాయణ, రొక్కాల నాగబుజ్జి పాల్గొన్నారు.

శిథిలమవుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జిలు

పట్టించుకోవాలని కోరుతున్న స్థానికులు



యాగర్లపల్లి-కడకట్ల రెండో ఫ్లైఓవర్ బ్రిడ్జి రెయిలింగ్ ఇలా..



ధ్వంసమైన ఫుట్‌పాత్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ప్రధాన ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్లక్ష్యం కారణంగా అవి శిథిలావస్తుకు చేరుతున్నాయి. ఎప్పుడు పనులు అప్పుడే చేస్తే అంతా సవ్యంగా సాగుతుంది. బ్రిడ్జిలు శిథిలం కాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులదే. ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎవరికి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉంది.

వివరాలలోకి వెళితే..

పట్టణంలోని వన్ టౌన్, టూ టౌన్‌లను కలుపుతూ స్థానిక ఏలూరు కాలువ, రైల్వే ట్రాక్‌లు మీదుగా ఎన్‌టీఆర్ జంక్షన్ నుంచి పోలీస్ ఐలాండ్ వరకు మొదటి ఫ్లైఓవర్ బ్రిడ్జి, అదే విధంగా కడకట్ల నుంచి యాగర్లపల్లి వైపునకు సెకండ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించారు. నేడు ఫ్లైఓవర్‌లకు ఇరువైపుల ఏర్పాటు చేసిన ఫుట్ పాత్‌లు, సైడ్ శ్లాబ్‌లు, శ్లాబ్ అంచులు, ఫుట్ పాత్ వాల్స్, పిల్లర్స్ శిథిలమవుతున్నాయి. పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మొదటి ఫ్లైఓవర్ బ్రిడ్జి పైన

మొదటి ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైన, పిల్లర్స్‌పైన, సైడ్ శ్లాబు అంచులలోను రావి, మర్రి మొక్కలు మొలవడం. ప్రస్తుతం అవి పెద్దవి అవుతున్నాయి. రానున్న రోజులలో అవి వృక్షాలుగా మారే అవకాశాలు కానవస్తున్నాయి. ఎంతో ప్రాముఖ్యత కలిగిన, ప్రాధాన్యత కలిగిన బ్రిడ్జిమీద మర్రి, రావి మొక్కలు మొలుస్తున్నా ఎవరూ పట్టించుకోక పోవడం శోచనీయమని చెబుతున్నారు. గతంలో ఈ మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించికపోవడంవల్ల తిరిగి అవి పెద్దవి అవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే బ్రిడ్జి పాడై, ప్రజలు ఇబ్బందులు పడే అవకాశాలు మెండుగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అదే విధంగా ఇటీవల ఫ్లై ఓవర్ బ్రిడ్జి రహదారిపైన గోతులు పడ్డాయి. మరమ్మతులు చేసినప్పటికి తిరిగి గోతులు కానవస్తున్నాయి. తక్షణమే అధికారులు రహదారిపైన ఏర్పడే గోతులు పెద్దవికాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రెండో ఫ్లైఓవర్ బ్రిడ్జి పైన

బ్రిడ్జికి ఇరువైపుల ఫుట్‌పాత్‌లపై ఏర్పాటుచేసిన రాళ్ల శిథిలం కావడంతో పాటు పాడి, పాడిగాను విరిగిపోవడం, వంగిపోవడమే కాక గోతులు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల సిమ్మెంట్ రాళ్లకు ఉన్న ఊసలు కానవస్తున్నాయి. ఆ ఊసలు సైతం సూదిగా తయారై పాదచారులకు అవి తగిలి గాయాలు అవుతున్నాయి. వీటి కారణంగా నడిచేవారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. చాలా ప్రాంతాలలో సుమారు పది అడుగులు నుంచి ఇరవై అడుగులు వరకు ఫుట్‌పాత్ రాళ్లు లేకపోవడంతో ఫుట్‌పాత్‌లపై నడిచేందుకు వీలు ఉండటం లేదు. పాదచారులు ఫుట్‌పాత్‌పై నడిచే పరిస్థితులు ఉండటం లేదు. కొన్ని చోట్ల ఫుట్ పాత్ గొతుల్లో రాళ్ల రప్పలు తెచ్చి పోశారు. సిమ్మెంట్ చేయించలేదు. దీంతో ఫుట్‌పాత్ నుంచి దిగి రహదారి మార్గంలోనే నడుస్తున్నారు. రోడ్డు మీద నడిచే సమయంలో ఎప్పుడు ఏ వాహనం గుద్దుతుందోనని పాదచారులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ ఫుట్‌పాత్‌లపై నడిచి, చీకటి కారణంగా ప్రమాదాలకు గురైన వారు సైతం ఉన్నారని, రాళ్ల లేని కారణంగా ఏర్పడిన గోతులలో పడి గాయాలు పాలైనట్లు స్థానికులు వాపోతున్నారు. అదే విధంగా కడకట్ల వంతెనపై ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలలోని వైర్లు బయిటకు కానవస్తున్నాయి. విద్యుత్ వైర్లు వల్ల ప్రమాదాల భారీన పడే అవకాశాలు కానవస్తున్నాయి. విద్యుత్ వైర్లు కానవస్తున్న బాక్స్‌లకు మూతలు పెట్టి స్క్రూలు భిగించాలని కోరుతున్నారు.



మొదటి ఫ్లైఓవర్ బ్రిడ్జి పిల్లర్స్ వద్ద మొలిచిన మొక్కలు



మొదటి ఫ్లైఓవర్ బ్రిడ్జి రహదారిపై గొయ్యి

అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు

ఈ బ్రిడ్జిలు వ్యవహారంలో సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పరిస్థితి మార్పు లేదని ప్రజలు వాపోతున్నారు. ఎప్పుడు నిత్యం రద్దీగా ఉండే ఈ బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌లను, సైడ్ వాల్‌లను సరిచేయాలని, మొలిచిన మొక్కలను, ఇతర ఇబ్బందులను తొలగించాలని, బ్రిడ్జిలు శిథిలం కాకుండా చూడాలని, పాదచారులు ఇబ్బందులను గుర్తించాలని కోరుతున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని, సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిలకు మరమ్మతులు చేపట్టాలి



రెండో ఫ్లై ఓవర్ బ్రిడ్జికు ఇరు వైపుల ఫుట్‌పాత్‌లు, సైడ్‌వాల్స్ శిథిలమయ్యాయి. గొయ్యిలు ఏర్పాడ్డాయి. బ్రిడ్జిపై మొక్కలు మొలుస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాము. సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జిలకు ఏర్పడిన ఆయా సమస్యలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. బ్రిడ్జిలు శిథిలం కాకుండా చూడాలి.

– తాడేపల్లి శ్యాంబాబు, అంబేద్కర్ ఇండియా మిషన్ టౌన్ ప్రెసిడెంట్

రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి



ఆరవల్లిలో పొలం పొలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న మార్టేరు ఏడీఏ ఎంవీ రమేష్

అత్తిలి: రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పురుగుమందుల పిచికారీ చేయాలని మార్టేరు ఏడీఏ ఎంవీ రమేష్ అన్నారు. బుధవారం అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ ఎరువులకు భిన్నంగా నానో యూరియా, నానో డిఏపి వాడాలన్నారు. రైతులందరూ పంటల బీమా చేయించుకోవాలని రైతులకు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టీకే రాజేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు గాయత్రి, రైతులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



పెంటపాడు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయ్

పెంటపాడు: మండలంలోని పెంటపాడు పీహెచ్‌సీని బుధవారం జిల్లా వైద్యాధికారి కేవీ గీతాబాయి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా లాబ్, తల్లిబిడ్డల ఆరోగ్యంపై ఆరా తీసారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణుల టీకాల కార్యక్రమాన్ని, పరీక్షలను పరిశీలించారు. పీహెచ్‌సీలో కాన్పులు జరిగేలా సిబ్బంది చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి తోట రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొట్టు పరామర్శలు



వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో బుధవారం మాజీ కొట్టు సత్యనారాయణ పర్యటించారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులను పలుకరించారు. సమస్యలు అడిగితెలుసుకొన్నారు. ఈ సందర్భంగా పెంటపాడులో ఇటీవల అనారోగ్యానికి గురైన దాసరి రాముని కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. అనంతరం ఆకుతీగపాడు గ్రామంలో మండల ఉపాధ్యక్షుడు కొణతాల వెంకట్రావు కుటుంబ సభ్యులైన కొణతాల పెదకాపు కుటుంబాన్ని కొట్టు సత్యనారాయణ పలుకరించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. రాబోయేది జగనన్న ప్రభుత్వమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్‌లు సలుమూరి ప్రకాష్, కర్రి వరహాల రెడ్డి, నల్లమిల్లి అప్పిరెడ్డి, గుండుమోగుల సాంబయ్య, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, ఎంపీపీ దాసరి హైమావతి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, పెంటపాడు గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, బొద్దాని శ్రీనివాస్, కర్రి పృథ్వికుమార్, ఉండ్రాజవరపు రాజు, బండారు రాంబాబు ఆయా గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాఠశాలలో మేనేజ్‌మెంట్ సభ్యులను, తల్లిదండ్రులను తప్ప మిగతా వారిని ఎవరిని పాఠశాలలోకి అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ అధికారులు సర్క్యులర్ విడుదల చేశారని, వెంటనే వెనక్కి తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో బుధవారం తాలూకా ఆఫీస్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మంగరాజు మాట్లాడుతూ విద్యాశాఖ ఉత్వర్వులు ప్రజాస్వామ్య హక్కులను హరించే విధంగా ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు బయిటకి రాకుండా, విద్యార్థుల నోరు నొక్కే ప్రయత్నం ప్రభుత్వం తీసుకుందని విమర్శించారు. కార్పొరేట్ స్కూల్‌లో విద్యా వ్యాపారాన్ని, అనేక అన్యాయాలను దళిత సంఘాలు, విద్యార్థి సంఘాలు, మీడియా ద్వారా ఎన్నో సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం ఉండటం లేదని, ఈ ఉత్తర్వులతో పూర్తిగా నోరు నొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. జీవోను రద్దు చేయకపోతే దళిత సంఘాలు, విద్యార్థి సంఘాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చెపడతామని మంగరాజు హెచ్చరించారు. దళిత, ప్రజా సంఘాల నాయకులు, గుంపుల సత్యకృష్ణ, వెంకట రమణ, రాజు, రవి, అచ్చిబాబు, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అరాచకాలు పెరుగుతున్నాయి



సీనియర్ నాయకురాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళల పట్ల అరాచకాలు పెరుగుతున్నాయని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ ఆందోళన వ్యక్తం చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల మూడోవ మహాసభ బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో పాలూపూరి సత్యవతి అధ్యక్షతన జరిగింది. పూర్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమైతే ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు ఏమిటి అని ప్రశ్నించారు. ఓ పక్కన మహిళలకు రక్షణ కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వాలు మహిళలు పట్ల హత్యలు, అరాచకాలు పెరుగుతున్న అరికట్టలేని పరిస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. ఈ నెల 20వ తేదీన భీమవరంలో జరుగుతున్న జిల్లా మహాసభలను జిల్లా వ్యాప్తంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. పట్టణ కార్యదర్శి బొంకూరు యశోదదేవి, కండెల్లి కమల కుమారి, గంటికోట లక్ష్మి, బాయ్, మల్లిపూడి సీతామహాలక్ష్మి, పాల్గొన్నారు. పి.వెంకాయమ్మ చిత్రపటానికి మహిళలు పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: తణుకు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని సబ్ స్టేషన్‌లలో విద్యుత్ లైన్స్ మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ డివిజనల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు పట్టణ పరిధిలో ఎన్టీఆర్ పార్కు, సాయి హాస్పిటల్, ఎన్జీవో కాలనీ, కొండాలమ్మ పుంత, ఉమెన్స్ కళాశాల, డీమార్ట్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు, అత్తిలి మండలంలోని కొమ్మర, ఈడూరు, కంచుమర్రు, స్కిన్నెరపురం, సీహెచ్‌చెర్వు గ్రామాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం సేవించిన నలుగురికి జరిమానా

భీమవరం: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున భీమవరం స్పెషల్ జ్యుడిషియల్ 2వ తరగతి మెజిస్ట్రేట్ ఎంవీఎస్ రాజారావు జరిమానా విధించినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు చెప్పారు. మంగళవారం రాత్రి వన్‌టౌన్ పరిధిలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా ఇద్దరు ఆటో డ్రైవర్లు, 12 మంది ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశామన్నారు. వీరిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నలుగురికి జరిమానా విధించారని సీఐ చెప్పారు.

ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలి

భీమవరం: వేగం కన్నా ప్రాణం మిన్నగా భావించి హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయడం ఎంతో ప్రయోజనమని భీమవరం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనం వద్ద ఏర్పాటు చేసిన హెల్మెట్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ఎంతో ప్రమాదకరమని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. హెల్మెట్ వాడకం పట్ల అవగాహన కల్పించడానికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం పలువురికి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగి, మానవతా సంస్థ ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ ఎస్‌కే చాన్‌భాషా, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాతల జేమ్స్, అల్లు శ్రీనివాస్, న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం, ట్రాఫిక్ ఎస్ఐ గగారిన్, దుగ్గిరాల శ్రీను, మైలే రాజు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ దశల వారీ ఆందోళనా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సిపాయిపేట భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో సోమసుందర్ మాట్లాడుతూ మునిసిపల్ కార్మికుల సమస్యలు చిరకాలంగా పరిష్కారానికి నోచుకోలేదని, దఫాదఫాలుగా ఉద్యమాలు చేసినా అధికారులు స్పందించడం లేదని చెప్పారు. పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్ ఎలక్ట్రికల్, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, ఉద్యోగాలు పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్త సమ్మెకు నోటీస్ ఇచ్చామని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోని పక్షంలో సమ్మె అనివార్యమన్నారు. కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగులకు, కార్మికులకు పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డీఏ బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పనిభద్రత కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఓసూరి వీర్రాజు, కళింగ లక్ష్మణరావు, మండలపర్తి హరీష్, తాడికొండ శ్రీనివాసరావు, పడాల శ్రీనివాస్, పోలిరాతి ఆదినారాయణలు మట్లాడారు. చంద్రరావు, కాటమరాజు, మాదాసు సత్యనారాయణ, కర్రి వీర వెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



తణుకులో యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ రామ్‌కుమార్

తణుకు అర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు. లార్వా దశలోనే దోమ పుట్టుకకు చెక్ పెట్టేందుకు ఈ స్పెషల్ యాంటీ లార్వాల్ ఆపరేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ఇరగవరం రోడ్డులో బుధవారం ప్రత్యేక యాంటీ లార్వాల్ ఆపరేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన యాక్టివిటీ రోజూ నిర్వహించే యాంటీ లార్వాల్ ఆపరేషన్‌కు అదనమని, దోమ కాటు వ్యాధుల తీవ్రతను తగ్గించడంలో ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. అడల్ట్ మస్కిటోగా మారకుండా చేయడంలో ఈ స్ప్రేయింగ్ బాగా ఉపకరిస్తుందని, డ్రైయిన్‌లలో చెత్త వేస్తున్న పరిస్థితులు అధికమని, దీని వలన మురుగు నీటి పారుదలకు ఆటంకం కలిగి డ్రెయినేజీల్లో దోమల ఉత్పత్తి స్థావరాలుగా మారిపోతున్నాయని అన్నారు. మునిసిపాలిటీ పరిధిలో ప్రతి ఒక్కరూ ఈ సమస్యను గ్రహించి తదనుగుణంగా, తడిచెత్త, పొడి చెత్తలను మూతలు కలిగిన వేరువేరు డస్ట్ బిన్‌ల్లో వేసి, మునిసిపల్ చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజా నాగభూషణం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఈశ్వరరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, స్ప్రేయింగ్ నిర్వహణా పరిశీలకులు వంక నాని, కూటమి నాయకులు కలగర వెంకటకృష్ణ, బసవ రామకృష్ణ, బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

ఉండి: అధిక కట్నం తేవాలంటూ మహిళ వేధింపులకు గురికావడంతో పోలీసులను ఆశ్రయించింది. వారు తెలిపిన వివరాల ప్రకారం ఉండి పెదపేటకు చెందిన గుండుగొల్లు దివ్య, గుండుగొల్లు సాల్మన్‌రాజు భార్యాభర్తలు. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. అయితే వివాహానంతరం మద్యానికి, చెడు అలవాట్లకు బానిసైన సాల్మన్‌రాజు శారీరకంగా, మానసికంగా తనను వేధింపులకు గురిచేస్తున్నట్లు అతనికి అత్త మామలు, ఆడపడుచు సహకరిస్తున్నారని దివ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎండీ నసీరుల్లా వివరించారు.

అస్తవ్యస్తం.. అవస్థలమయం





పెంటపాడు మండలం యానాలపల్లి గ్రామంలో ఎస్సీపేటలో ఇటీవల కురిసిన వర్షం దాటికి చిత్తడిగా మారిన రహదారులు

పెంటపాడు: మండలంలోని ఎస్సీ కాలనీలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రధానంగా కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఏడాదిన్నర కావస్తున్నా ఎస్సీకాలనీల అభివృద్ధిని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసింది. పెంటపాడు మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షం వల్ల ఎస్సీకాలనీలు చిత్తడిగా మారాయి. గత ప్రభుత్వంలో వేసిన రహదారులు నేడు మట్టి రోడ్లుగా మారాయి. కనీసం నడిచేందుకు కూడా వీలుగా లేదు. ప్రధానంగా పెంటపాడు మండలం యానాలపల్లి గ్రామంలో జనసేన సర్పంచ్ ఉన్నా అభివృద్ధి మాత్రం జరగడం లేదు. తాగునీటి చెరువు కూడా అపరిశుభ్రంగా ఉంది. ప్రధాన డ్రెయినేజీ కూడా పనులు చేయించుకోలేని దుస్థితి ఉంది. కాగా పేట వాసులు ఈ విషయంపై తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలని పేట వాసులు కోరుతున్నారు.